క్లుప్తంగా

పుట్టగొడుగుల సాగుతో అధిక లాభాలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఏవో భాగ్యలక్ష్మి, తదితరులు

చొప్పదండి: తక్కువ పెట్టుబడితో పుట్ట గొడుగుల పెంపకం ద్వారా ఎక్కువ లాభాలను పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా పుట్ట గొడుగుల పెంపకం, సాగు విధానం, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో వంశీకృష్ణ, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

రైతులు అభ్యంతరాలు తెలియజేయాలి



నవాబుపేటలో ఫీల్డ్ ఎంక్వైరీ చేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్‌ప్రకాశ్

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్, ఇందుర్తి, సుందరగిరి గ్రామాల్లో గౌరవెల్లి సాగునీటి కెనాల్ తవ్వకాల్లో కోల్పోతున్న భూములు, ఇతర ఆస్తులను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్‌ప్రకాశ్ మంగళవారం పరిశీలించారు. ఇరిగేషన్ డీఈఈ ప్రశాంత్‌తో కలిసి రైతులతో మాట్లాడారు. కెనాల్ తవ్వకాల్లో తొలగించే మామిడి, బత్తాయి, టేకు, ఇతరత్రా చెట్లు, పైపులైన్స్, పశువుల పాకలు జాయింట్ ఇన్స్‌పెక్షన్ చేశారు. రైతులు అభ్యంతరాలుంటే తెలియజేయాలని, గత సర్వేలో గుర్తించని వాటిని లెక్కించనున్నామని పేర్కొన్నారు. వెంట తహసీల్దార్ రమేశ్, ఆర్ఐ అరుణ్‌కుమార్, ఏఈలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గోదాముల్లో ధాన్యం నిల్వ చేసుకోవాలి



మాట్లాడుతున్న డైరెక్టర్ డాక్టర్ మరియదాస్

జమ్మికుంట: పండించిన పంటలకు మార్కెట్‌లో తక్కువ ధర ఉన్నప్పుడు గోదాముల్లో ధాన్యం నిల్వ చేసి అధిక ధర పొందవచ్చని ఎన్ఐపీహెచ్ఎం హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ మరియదాస్ సూచించారు. మంగళవారం పట్టణంలోని కేవీకేలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్ మెంట్ ఆధ్వర్యంలో పప్పు, నూనె గింజలు, వరి ధాన్యం నిల్వ చేసుకోవడంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం వేర్ హౌజింగ్ డెవలప్‌మెంట్ రెగ్యులేటరీ అథారిటీ(డబ్ల్యూడీఆర్ఏ) ప్రవేశ పెట్టిన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రైతులతో గోదాముల సందర్శన చేసి, నిల్వ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంతి, విజయ్ రైతులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



సన్మానిస్తున్న ఉద్యోగులు

హుజూరాబాద్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న నాయిని వెంకట్‌రెడ్డి, బొంగొని రాజమౌళి ఉద్యోగ విరమణ కార్యక్రమం మంగళవారం డిపో కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డిపో మేనేజర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. విరమణ ఉద్యోగానికే తప్పా వయస్సుకు కాదని, రిటైర్డ్ ఉద్యోగులు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం పదవి విరమణ చేసిన ఉద్యోగ దంపతులను ఆర్టీసీ ఉద్యోగులు శాలువాలతో సత్కరించారు.

ప్రణవ్ సమక్షంలో జన్మదిన వేడుకలు

ఇల్లందకుంట: కాంగ్రెస్ పార్టీ ఇల్లందకుంట మండల అధ్యక్షుడు ఇంగిలే రామారావు జన్మదినం పురస్కరించుకొని మంగళవారం హైదరాబాద్‌లో హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ నివాసంలో కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొడిశాల పరమేశ్వర్, గోలి కిరణ్, ఎడ్ల కిషన్‌రెడ్డి, మూడెత్తుల మల్లేశ్, ఎండీ. లాల్, సలీం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఏడాది సంబరాలు



గన్నేరువరం: పొలంలో కేక్ కట్‌చేస్తున్న డీసీసీ కార్యదర్శి సునీల్, కూలీలు



హుజూరాబాద్ బేకరీలో కేకుల కొనుగోలు



మానకొండూర్: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హుజూరాబాద్/మానకొండూర్/గన్నేరువరం: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో 2024 సంవత్సరానికి వీడ్కోలు, 2025 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రజలు సంబురంగా వేడుకలు జరుపుకున్నారు. న్యూ ఇయర్‌ను పురస్కరించుకొని ఆయా రంగాల బిజినెస్ ఫుల్‌గా జరిగింది. హుజూరాబాద్ పట్టణంలో కరీంనగర్–వరంగల్ ప్రధాన రోడ్డును ఆనుకొని ఉన్న ఫుడ్ స్టాల్స్ ఎదుట కొత్త ఏడాదిని పురస్కరించుకొని వివిధ వంటకాలను సిద్ధం చేశారు. స్వీట్ వంటకాలను సైతం ప్రజలు ఎగబడి కొనుగోలు చేశారు. పట్టణంలోని ఆయా రెస్టారెంట్ల యాజమానులు బిర్యానీ ఆఫర్లు ప్రకటించడంతో ఇంట్లో వంటకాలను ఆపేసి జంబో ప్యాకెట్లకు భారీగా ఆర్డర్లు ఇచ్చారని యజమానులు తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది ధరలు కాస్త పెరగడంతో వినియోగదారుల కంగుతిన్నప్పటికీ న్యూయర్ వేళ అసలు తగ్గేదలే అంటూ వేడుకల్లో పాల్గొన్నారు. కేకుల విక్రయాలు జోరుగా సాగాయి. బేకరీలతో పాటు ప్రత్యేకంగా టెంట్లు వేసి మరీ కేకులు విక్రయించారు. కస్టమర్లకు రుచికి తగ్గటుగా కేకులను విభిన్న ఆకృతులలో తయారు చేయటంతో కేకులు భారీగా విక్రయం జరిగాయి. దీనికి తోడు స్నాక్స్, కూల్ డ్రింక్స్ సైతం అదే స్థాయిలో విక్రయాలు జరిగినట్లు సమాచారం. మద్యం విక్రయాలు ఉదయం నుంచి జోరందుకున్నాయి. తాగి రోడ్లపైకి రావద్దంటూ పోలీస్ శాఖ ఉత్తర్వులు జారీ చేయడంతో ఇళ్లల్లోనే వేడుకలను జరుపుకున్నారు. దీనికి తోడు మద్యం షాపుల సమయాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటంతో మందుబాబులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చికెన్, మటన్ విక్రయాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగాయి. ఎక్కడ చూసిన దుకాణాల ఎదుట మాంసం కోసం బారులు తీరారు. కొత్త సంవత్సరానికి రంగులతో స్వాగతం పలికేందుకు రంగుల విక్రయాలు జోరుగా నడిచాయి. హుజూరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రైవేట్ విద్యా సంస్థల్లో నూతన సంవత్సర సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో పాఠశాలకు హాజరయ్యారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మానకొండూర్‌లోని చాణక్య ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. స్కూల్ కరస్పాండెంట్ ఆడెపు రవీందర్ పాఠశాల క్యాలెండర్ ఆవిష్కరించారు. కేకు కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. గన్నేరువరంలో నూతన సంవత్సర వేడుకలను డీసీసీ కార్యదర్శి బొడ్డు సునీల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వరి నాట్లు వేస్తున్న పొలంలో కూలీలతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సుగుణ, స్వప్న, మాధవి, మౌనిక, లచ్చవ్వ, శాంతవ్వ, కనకవ్వ, భాగ్య, పద్మ, రేణుక, లస్మవ్వ, మల్లవ్వ, కనకవ్వ, వరవ్వ పాల్గొన్నారు.



హుజూరాబాద్: ఆల్ఫోర్స్ స్కూల్లో వేడుకలు





హుజూరాబాద్ పట్టణంలో ప్రత్యేక బాక్సుల్లో మాంసం విక్రయం, స్పెషల్ రోటీ తయారీ

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామం ఇందిరమ్మ కాలనీలో ఉపాధిహామీ నిధులు రూ.పది లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను మంగళవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జవ్వాజీ హరీశ్, మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యులు శుక్రుద్దీన్, కాంగ్రెస్ నాయకులు కాడె శంకర్, కోల రమేశ్, పిండి సత్యంరెడ్డి, పంజాల శ్రీనివాస్‌గౌడ్, జక్కుల బాబు, శేఖర్, కృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న విజయలక్ష్మి మల్లయ్య, వార్డు ప్రజలు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని నాయిని చెరువు శిఖం భూమి ఆక్రమణకు గురైందని, అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూమిని కాపాడాలని కౌన్సిలర్ పొనగంటి విజయలక్ష్మిమల్లయ్య అన్నారు. మంగళవారం చెరువ వద్ద విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సర్వే నంబర్ 808/బీ/ఈ/1లో 42 గుంటల భూమి ఉండాల్సింది కానీ ఆరు గుంటల భూమి ఆక్రమణకు గురైందని, కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ ప్లాట్లుగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. డిసెంబర్ 13న జమ్మికుంట తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశామన్నారు. అంతేకాకుండా హుజూరాబాద్ సబ్ రిజిస్ట్రార్‌కు లేక రాశామని, కలెక్టర్, రెవెన్యూ అధికారులు ఆక్రమణ విషయంపై స్పందించి చెరువు కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని, బఫర్ జోన్ పరిధిలోని చెరువు శిఖం భూమిని కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

మొలంగూర్‌లో ఘనంగా అయ్యప్పపడిపూజ



పడిపూజలో అయ్యప్ప మాలధారులు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో శివాలయం పూజారి నాగయ్య ఇంట్లో మంగళవారం అయ్యప్పస్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్పదీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

మానసాదేవి ఆలయానికి ఫ్యాన్లు వితరణ



ఫ్యాన్లు బహూకరిస్తున్న ఆడెపు రాజ్‌కుమార్

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట శ్రీమానసాదేవి ఆలయానికి గ్రామానికి చెందిన ఆడెపు రాజ్‌కుమార్ కుటుంబసభ్యులతో కలిసి రూ.51,600 విలువ గల ఫ్యాన్లను ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు బద్దం చిన్న నర్సింహారెడ్డి, చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, అకెన రవి, బద్దం లచ్చిరెడ్డి, సందవేని లక్ష్మణ్, కల్లెపల్లి దుర్గయ్య, హరీశ్, భక్తులు పాల్గొన్నారు.

పురగిరి క్షత్రియ పెరిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పెరిక సంఘం నాయకులు

తిమ్మాపూర్: మండలంలోని నల్లగొండ శ్రీసీతారామ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పురగిరి క్షత్రియ పెరిక సంఘం– 2025 క్యాలెండర్‌ను మంగళవారం జిల్లా అధ్యక్షుడు గాండ్ల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి బసవ వెంకన్న, రాష్ట్ర కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పాలేటి కుమారస్వామి ఆవిష్కరించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కొత్త ఏడాదిలో అందరికీ శుభం జరగాలని ఆకాంక్షించారు. సంఘం ఐక్యతకు అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. పురగిరి క్షత్రియ పెరికలు కొత్త ఏడాదిలో అన్నిరంగాల్లో రాణించాలని, ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. మక్తపల్లి గ్రామ అధ్యక్షుడు చింతం లక్ష్మణ్, గాండ్ల రాము వర్మ, పాలేటి ఆంజనేయులు, గాండ్ల సత్యం,చింతం రఘు,పాలేటి జనార్దన్, గాండ్ల వీరయ్య, దాసరి రాజు, బొట్టు వెంకటేష్, దాసరి వినయ్, తమ్మిశెట్టి హరి ఆంజనేయులు, చింతం తిరుపతి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు జాబితా

చిగురుమామిడి: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు జాబితా సిద్ధమైందని తహసీల్దార్ ఎం. రమేశ్ తెలిపారు. మంగళవారం కార్యాలయంలో మాట్లాడారు. మండలంలోని 17 గ్రామాల్లో 2050 మంది పట్టభద్రులు, 47 మంది ఉపాధ్యాయ ఓట్లు నమోదయ్యాయని, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన జాబితాను చిగురుమామిడి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రదర్శించామని, మూడు బూత్‌ల్లో జాబితా ఉంటుందన్నారు. పట్టభద్రుల ఓటర్లలో 1308 మంది స్త్రీలు, 742 పురుషులు ఉన్నారని, మొదటి పోలింగ్ బూత్‌లో 756, రెండో బూత్‌లో 750, మూడో బూత్‌లో 544 మంది ఉన్నారని ఓటరు లిస్ట్‌లో పేరు చూసుకోవాలన్నారు.

రెండు బైక్‌లు ఢీ

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో మంగళవారం రెండు బైక్‌లు ఢీకొన్నాయి. కేశవపట్నం బైక్ షోరూంలో మెకానిక్‌గా పనిచేసే వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మరో బైక్ ఎదురుగా ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌లపై వెళ్తున్న ఇరువురికి స్వల్పగాయాలయ్యాయి.

నూతన కార్యవర్గం



టైల్స్ యూనియన్ కార్యవర్గం

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామ టైల్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మామిండ్ల మధు, ఉపాధ్యక్షుడిగా ఇల్లందుల రాము, కోశాధికారిగా ఏముండ్ల ఐలయ్య ఎన్నికయ్యారు.

భూ ఆక్రమణపై విచారణ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో విలువైన ప్రభుత్వ భూముల ఆక్రమణపై విచారణకు కలెక్టర్ పమేలా సత్పతి చర్యలు తీసుకున్నారు. ఆర్డీవో కె.మహేశ్వర్ ఆధ్వర్యంలో 9 మంది జిల్లా, మండల స్థాయి అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. బొమ్మకల్‌లో లక్షలాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని సామాజిక కార్యకర్త దొమ్మాటి బాబు ప్రజావాణిలో పలుమార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె ఆక్రమణకు గురైన సర్వే నంబర్లు 494, 105, 74, 96,147, 604, 623, 652, 728, 729, 765, 797తోపాటు అక్రమంగా ఇంటి నంబర్లు జారీ చేసిన సర్వే నంబర్లు 28, 105, 108, 188, 208, 250, 494లలోని ప్రభుత్వ భూముల ఆక్రమణపై కమిటీ వేశారు. ఇందులో ఆర్డీవోతో పాటు డీపీవో, డీఎల్‌పీవో, జిల్లా ఇరిగేషన్ అధికారి, ఏడీ సర్వే ల్యాండ్స్ అండ్ రికార్డ్స్, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, ఇరిగేషన్ ఏఈ, మండల సర్వేయర్ సభ్యులుగా ఉన్నారు. బొమ్మకల్‌లో సర్వే నంబర్లు 28, 105, 108, 765లలోని ప్రభుత్వ భూములను ఆర్డీవో మహేశ్వర్ ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం పరిశీలించి, విచారణ చేపట్టారు. ముందుగా సర్వే నంబర్ల వారీగా స్థలాలను సర్వే చేసి, హద్దులు ఏర్పాటు చేయాలని ఆర్డీవో ఆదేశించారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వెంట డీపీవో రవీందర్, సర్వే ల్యాండ్స్ అండ్ రికార్డ్స్ ఏడీ ప్రభాకర్, తహసీల్దార్ రాజు, ఆర్ఐ వాస్తవిక్, ఫిర్యాదుదారు బాబు తదితరులున్నారు.



ఇల్లందకుంట: సుమారు నాలుగేళ్ల క్రితం రూ.పది లక్షలతో కొనుగోలు చేసిన వైకుంఠరథాన్ని పట్టించుకునేవారు కరువయ్యారు. శ్మశాన వాటికలకు మృతదేహాలను తరలించేందుకు సమకూర్చిన వైకుంఠరథం ప్రారంభానికి నోచుకోక గ్రామ పంచాయతీ ఆవరణలో నిలపడంతో తుప్పపడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వైకుంఠరథాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
పుల్లయ్య, ఎంపీడీవో, ఇల్లందకుంట సెల్ నంబర్: 92814 82640

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

పట్టణ అభివృద్ధే పాలకవర్గ ధ్యేయం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: పట్టణ అభివృద్ధే ధ్యేయంగా పాలకవర్గం పనిచేస్తుందని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ రాజేశ్వర్‌రావు అధ్యక్షతన, కమిషనర్ ఎండీ అయాజ్ ఆధ్వర్యంలో మంగళవారం కౌన్సిల్ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. 30వార్డుల కౌన్సిలర్లు హాజరు కాగా 19 అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు. పురపాలక కార్యాలయం గేటు నిర్మాణానికి, డీఆర్‌సీసీ సెంటర్ లైట్లు, బోర్‌వెల్ మోటార్, బస్టాండ్,అబాది జమ్మికుంట బస్టాండ్ వద్ద పబ్లిక్ టాయిలెట్స్ మరమ్మతులు, పార్కులతోపాటు పలు అభివృద్ధి పనులకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కాగా మున్సిపల్ పరిధిలోని రామన్నపల్లిలో శ్మశన వాటిక నిర్మాణానికి నిధులు కేటాయించాలని మూడో వార్డు కౌన్సిలర్ రవీందర్ ప్లకార్డులతో కార్యాలయం ఎదుట అర్ధనగ్న ప్రదర్శన చేశారు. సమస్యలపై చైర్మన్ రాజేశ్వర్‌రావు స్పందింస్తూ శ్మశాన వాటికకు రెండు వైపులా ప్రభుత్వ స్థలం ఉందని గ్రామ పెద్దలు శ్మశాన వాటికకు సంబంధించి స్థల నిర్ధారణ చేయకపోవడం వల్లనే జాప్యం జరిగిందని, కౌన్సిలర్ పాలకవర్గంపై అసత్య ప్రచారం చేస్తున్నారని చైర్మన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ స్వప్నకోటి, మేనేజర్ రాజిరెడ్డి, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సన్నాహక సదస్సు విజయవంతం చేయాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

హుజూరాబాద్: జిల్లా కేంద్రంలో 8న జరిగే లక్ష డప్పులు, వెయ్యి గొంతుల సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని మాదిగ కళా మండలి జిల్లా ఇన్‌చార్జి రామంచ భారత్ మాదిగ అన్నారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో డివిజన్ స్థాయి కళా నాయకుల సన్నాహక సమావేశం మండలి జిల్లా అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. కళాకారులకు రావాల్సిన హక్కులను న్యాయంగా అమలు చేయాలని, రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహా కళా ప్రదర్శన నిర్వహణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఏపూరి సోమన్న నేతృత్వంలో ఫిబ్రవరి 3న హైదరాబాద్‌లో నిర్వహించే వెయ్యి గొంతులు–లక్ష డప్పుల మహా కళా ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రణాళిక రూపొందించామనిన్నారు. సమావేశంలో ఎమ్మెస్పీ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి, జిల్లా ఇన్‌చార్జి బెజ్జంకి అనిల్, నాయకులు రాంచందర్, వసంత్, శ్రీనివాస్, సాగర్, ఆంజనేయులు, అంజయ్య, మధునయ్య తదితరులున్నారు.

జాతీయ స్థాయికి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్, తదితరులు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారు సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక శిక్షణ విద్యాలయం విద్యార్థి పి. దుర్గారాజు జాతీయ స్థాయి హాకీ చాంపియన్‌షిప్ క్రీడా పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాడని ఈ నెల 7వ తేదీ నుంచి మధ్యప్రదేశ్‌లో జరిగే ఎస్‌జీఎఫ్ అండర్–14 విభాగంలో పాల్గొంటాడని ఎంపికయ్యాడు. విద్యార్థిని స్కూల్ డైరెక్టర్ కల్నల్ కేసీ రావు, ప్రిన్సిపాల్ జి. కాళహస్తీ, శ్రీనివాస్, ప్రమోద్ రాజు, ఇనాక్ బాల సుందర్‌రావు, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

'పట్టభద్రుల శ్రేయస్సే లక్ష్యంగా పని చేస్తా'

- మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్

కరీంనగర్: పట్టభద్రుల శ్రేయస్సే లక్ష్యంగా పని చేస్తానని మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. మంగళవారం నగరంలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలో ఉన్న పట్టభద్రులు తనను గెలిపించాలని కోరారు. కొందరు కేవలం తమ వ్యాపారాల కోసమే ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. తాను మాత్రం విద్యార్థి దశ నుంచి పేద, బడుగు బలహీన వర్గాల కోసం పని చేస్తున్నానని పేర్కొన్నారు. కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా, మేయర్‌గా ప్రజలకు మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేశానని పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా గెలిపిస్తే నాలుగు జిల్లాలో ఉన్న పట్టభద్రులకు కేవలం రూపాయికే హెల్త్ ఇన్సూరెన్స్ పథకం తీసుకువస్తానని హామీ ఇచ్చారు. యోగా అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్, శాతవాహన యూనివర్సిటీ జేఏసీ చైర్మన్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.